

# అసత్యమూ—నాగరికతా

హరిశ్చంద్రుడి చరిత్ర సత్యవ్రతానికి అనవసరమైన ప్రచారం చాలా చేసింది. నా మందబుద్ధికి. హరిశ్చంద్రుడు, గుడ్డెద్దు చేలో పడ్డట్టు నిజం చెప్పటం, అన్నం చాలా హానికరమని చక్కగా నిరూపిస్తున్నట్టు కనిపిస్తుంది. కాకపోతే అటువంటి వ్రతాలకు ప్రత్యేకవ్యక్తులను సంబంధించినంతవరకు కొంత ప్రాముఖ్యత లేకపోలేదు. అబద్ధానికి నైతికమైనబలంలేదని తేల్చేవరకూ సత్యవ్రతదీక్షను మౌనవ్రతదీక్ష మొదలైన దీక్షలకంటె ఎక్కువస్థానం ఇవ్వక్కర్లేదు. ఆ దీక్షనుగురించి రాయటం, కీర్తించటం, కన్న హానికరమైన విషయం ఉండబోదు.

అనృతంయొక్క నైతికబలం విచారిద్దాం. దానికి ముందు అనృతంయొక్క స్వరూపం విచారించవలసి ఉంది.

దీర్ఘంగా ఆలోచిస్తే సత్యంయొక్క స్వరూపం నిర్ణయించటం చాలా కష్టమనీ బహుశా అసంభవమనీ తేలుతుంది.

సత్యప్రకటన మాటలద్వారా జరిగినప్పుడు మాటలలో ఉన్న అసత్యం ప్రకటింపబడే సత్యాన్ని అరికట్టుతుంది. చంద్రుడెట్లా ఉంటాడని ప్రశ్నవస్తే సమాధానం అబద్ధాలమయం అయి తీరవలసిందే. ఎన్నిమాటలతో చంద్రుడియొక్క ఆకారం వినేవాడికళ్ళను కట్టినట్టు చెయ్యగలం? యుగాలుచాలవు, వాఙ్మయం యావత్తూ నిరర్థకం అయిపోతుంది. ఉపమానాలు తెస్తామా, ప్రతి ఉపమానమూ, సత్యాన్ని మరింత దూరంగా తోసేస్తుంది. చంద్రుణ్ణి చూపించి జ్ఞానేంద్రియంద్వారా ఇట్లా ఉంటాడని తెలియజేద్దామా, చక్షురింద్రియంయొక్క లోపాలన్నీ సత్యాన్నికప్పేస్తాయి. చంద్రుడి సమీపానికి వెళ్ళినకొద్దీ చంద్రుడి ఆకారం మారటం నిశ్చయం. అంతదూరంపోకుండా టెలెస్కోపులోనించి చూసినా తేలిపోతుంది. కంటికి ఇద్రిగానూ మద్రిగానూ కనిపించే చంద్రుడిమచ్చ క్రేటర్స్‌గా కనిపిస్తుంది దుర్భిణితో చూస్తే.

స్వల్పవిషయాల్లో మనం సత్యం చెప్పగలగటం లేదా? 'చేతివేళ్ళెన్ని?' అంటే 'పది' అని చెప్పలేమా? అని ఎవరైనా అడగవచ్చును. అటువంటి సత్యం మనకెంతవరకు ఉపకరిస్తుంది? అంతకన్న డాక్టర్లు తెలిసీ చెప్పే అబద్ధాలు ఎక్కువ ఉపకారం చేస్తున్నై.

ఒకపని చెయ్యవచ్చును; తియరీ ఆఫ్ రిలెటివిటీ ఆధారంచేసుకుని ఒకదానికన్న ఒకటి ఎక్కువసత్యం అనవచ్చును అనగా ఒకదాన్లోకంటె మరొకదాన్లో ఎక్కువ అసత్యం ఉంటూఉంటుంది; సత్యాసత్యాలన్నిటిలోనూ పాళ్ళుగా ఉన్నవని. అటువంటప్పుడు సత్యవ్రతదీక్ష హాస్యాస్పదంకాదా? హరిశ్చంద్రుడి ఎదట అంతకన్న సత్యవంతుడు పుట్టవచ్చును. దీనికి అంతేది?

మాటలకన్నా జ్ఞానేంద్రియాలకన్నా సత్యగ్రహణ శక్తిగలది మనస్సొకటి ఉంది. సత్యాన్వేషణ పరుడి మొదటివిధి దాన్ని అభివృద్ధిచెయ్యటం. దాని అభివృద్ధికి నాగరికత ఏమాత్రం తోడ్పడుతున్నది? పదార్థవిజ్ఞానశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంకా తదితర శాస్త్రాలూ అభివృద్ధిపొంది పంచేంద్రియాల లోటుపాట్లను సక్రమంగా నిరూపించి మనస్సును వాటి దాస్యంనించి తొలిగించాలని ప్రయత్నంచేస్తున్నమాట

వాస్తవమే. 'అదుగో సూర్యోదయం' అంటుంది కన్ను. 'అయితే సూర్యుడుఉదయించి ఎనిమిదినిమిషాలైంది' అని లెక్కచేసుకుంటుంది మనస్సు. ఇందువల్లమాత్రం ఏం లాభంఉందని అడగవచ్చునెవరైనా. చాలాలాభం ఉంది. మొదటిసంగతి, ఇటువంటి అభ్యాసంవల్ల మనసు జ్ఞానేంద్రియాల దాస్యవిముక్తి పొందటమేకాక సృష్టి యొక్క రహస్యాలను భేదించటానికి మానవ మనశ్శక్తి తగిన అభివృద్ధి పొందటంకూడా జరుగుతుంది. ఎప్పటికైనా సత్యాన్వేషణయొక్క గమ్యస్థానమదే— ఏదైనా ఉండటమంటూఉంటే. సత్యాన్వేషణకు మానవయుగం తగినపరికరాలు కలిగిలేదు. అయినా ఇంతకంటె తగినయుగం వచ్చేవరకూ ఇది అభివృద్ధి అవుతూ దానిరాక నిరీక్షిస్తూ ఉండటంకన్న గత్యంతరం లేదు.

ఇవి నిజంగా సత్యాన్వేషణకు అనుకూలమైన రోజులే. సందేహంలేదు. కాని మనం సత్యాన్వేషణకు చుట్టూ తిరిగిపోతున్నామేమో అని నాకు గట్టిఅనుమానంఉంది. ఇన్ని టెలెస్కోపులూ అబ్జర్వేటరీలూ లేకుండా పూర్వులు అద్భుతమైన జ్యోతిశ్శాస్త్రం నిర్మించారు. పెద్దపెద్ద యంత్రాలసహాయంతో చేసేపనులు బైరాగులల్లేవచ్చి మూలికలతోనూ మంత్రాలతోనూ చేస్తున్నారు. మనిషిలో ఎవరూ ఊహించని, ఎవరూ నమ్మని శక్తులు విదితంకానున్నై. ఈ శక్తులన్నీ పరిపూర్ణత్వానికి వచ్చేవరకూ మరోయుగంయొక్కరాక అనవసరం. ప్రతిపదార్థమూ ఎలక్ట్రాన్ ప్రోటాన్లకలయికచేత కలుగుతున్నదని శాస్త్రజ్ఞులు ఊహిస్తుండగా, ఎక్టోప్లాజం అనేపదార్థం కనిపెట్టబడ్డది. దానిచేత చేయబడిన జుట్టు మామూలుజుట్టల్లేనే ఉంది. ఇతరపదార్థాలను కూడా ఎక్టోప్లాజం తయారుచేస్తుందని నమ్మబడుతున్నది. ఎక్టోప్లాజం మనం ఇంటిలోవాడుకునే ఉప్పువంటి అనేకపదార్థాలయొక్క కలయికవల్ల తయారవుతున్నది! ఇప్పుడు ఎలక్ట్రాన్ప్రోటాన్లను ఏంచెయ్యాలి? శాస్త్రజ్ఞులని పేరుపెట్టుకుని బిరుదులుపొంది కులుకుతున్నవాళ్ళు ఇది 'స్పిరిచుయాలిజం'కు సంబంధించిన విషయమని ఎక్టోప్లాజంజోలికి పోకుండాఉన్నారు. ఈ పాశ్చాత్యనాగరికత పాశ్చాత్యదేశాలనూ వాటివెంట మనవంటి అగ్రకులాలనూ తప్పుదోవను తీసుకుపోతున్నదనటానికి సందేహంఉందా? ఒక్క ఈవిషయంలోనేకాక ఇతర విషయాలలోనూ పాశ్చాత్యనాగరికత ఇట్లాగే ఉన్నట్టుకనిపిస్తుంది. మంచి తెలివిగలవాడు పదినిమిషాలలో చెయ్యగల తీర్మానం బ్రిటిషుపార్లమెంటు అయిదుసంవత్సరాలను మించని కాలంలో చేస్తుందట! గోరుతో పొయ్యేదానికి గొడ్డలి—అదీ ఈ నాగరికత యొక్క పద్ధతి. ప్రపంచంఅంతటా రాజ్యాంగవిధానాల దగ్గిర్నించీ బట్టలు ధరించుకోటంవరకూ అసలు సూత్రాన్ని అర్థంచేసుకోకుండా మధనపడటంగా కనబడుతుంది.

ఉన్న నాగరికత ఒక్కరోజులో పొయ్యేదికాదు. ఈ నాగరికతలో అబద్ధానికి స్థానంఉంది.

'ఈరోగి జీవించే ఆశ వదులుకోండి!' అని డాక్టరు చెప్పదగిన పరిస్థితులు కలిగినపుడు ఆవిషయమై డాక్టరు చెప్పాలా అబద్ధం ఆడాలా అనేది నైతికసమస్య. ఆమాట అనటంవల్ల చావబోయేవాడికీ దగ్గిరవాళ్ళకూ చాలాబాధకలుగుతుంది. అబద్ధం ఆడితే రోగి చెయ్యవలిసిన పనులు చెయ్యకుండా చావటం తటస్థించవచ్చును. అటువంటప్పుడు నాగరికత డాక్టరుచేత లౌక్యంగా అబద్ధం ఆడిస్తుంది. 'రోగి జీవిస్తాడని నాకు చాలా గట్టినమ్మకం ఉంది. ఎటుపోయి ఎటువచ్చినా కీడెంచి మేలెంచమన్నాడు. నేను మందివ్వగలను కాని ఆయుర్దాయం...' అటువంటప్పుడు నాగరికతయొక్క అభివృద్ధిలో చావుకూడా కొంతస్థానం ఇవ్వబడటం, ప్రతివాడూ చావును ధైర్యంగా ఎదుర్కోగలగటం కూడిరావాలి. అంతవరకూ డాక్టరు అబద్ధాలాడవలిసిందే. లేకపోతే ఎవరూ పిలవరు. లేదా ఆస్తికగతులలో డాక్టరుయొక్క అబద్ధాలకు మరోపేరు పెట్టాలి. ప్రస్తుతం అట్లాగే జరుగుతున్నది.


ఈవిధంగానే ప్రతి ఎసెంబ్లీ సెషనులోనూ, పార్లమెంటరీ సెషనులోనూ, ప్రతి వార్తాపత్రికలోనూ, ప్రతి మీటింగులోనూ, ప్రతి పుస్తకంలోనూ, ప్రతి చోటా, ప్రతివాడి చేతనూ, అన్ని సమయాలలోనూ

నాగరికతను సమర్థించటాని కబద్ధా లాడబడుతున్నై. మనం ఉన్న నాగరికతలో తృప్తిపడిపోయినామని సూచించబడుతున్నది ఇందు మూలంగా!

ఇవేకాక ప్రతి రాజకీయ రహస్యమూ ఒక అబద్ధం కింద నేను లెక్కవేస్తాను—అవసరమైన అబద్ధంఅనండి కావాలంటే; అన్ని అవసరమైన అబద్ధాలలోనూ ఇదొకటి. ఆవిధంగానే మనప్రవర్తనను కట్టుబాటుచేసే నియమాలన్నీ అబద్ధాలు. ఎదురుగా 'ఏమండీ'అంటాం. అవతలికి వెళ్ళిన తరవాత అతణ్ణిగురించి మాట్లాడుతూ 'గారు' తగిలించమని మనకూ తెలుసు, వాడికీ తెలుసు. 'ఏమండీ!' అనేది ఒక అబద్ధం. బాహ్యంగా అచ్చులో పేరు చివరతగిలించే 'గారు' అబద్ధం. ఇటువంటివి శత సహస్రాలు. వీటిని నేను ఖండించటంలేదు. అవి లేకపోవటం పెద్దతప్పుగాకూడా భావిస్తాను. నాగరికత ఎంత అసత్యాన్ని పురస్కరించుకుని ఉందో మనవిచేస్తున్నాను. ఇవన్నీ క్రమంగా తగ్గిపోవాలనికూడా అంటాను. అందువల్ల నాగరికత వెనక్కుపోతుందని సంశయంరావచ్చును. అట్లా ఎప్పటికీకాదు. అతినాగరికతా అసలు నాగరికతలేకపోవటం ఒక్కవిధంగానే కనిపిస్తయి స్థూలదృష్టికి. అడవిమనుష్యులూ తక్కువ గుడ్డలతో జరుపుకుంటారు పాశ్చాత్యస్త్రీలూ గుడ్డలు లేకుండానే జరుపుకుంటారు నాగరికత మనుష్యులచేత అటువంటిపనులు చేయిస్తుంది. ఈ గుడ్డలులేకపోవటం అడవిమనుష్యులలోనూ పాశ్చాత్య సౌందర్యవతులలోనూ ఒకటిగానేఉందని ఒక్కనాటికి అనుకోరవరూ. అట్లాగే ఇటువంటి చిన్నచిన్నసమస్యలు నాగరికతలేనప్పుడు అసలుండవు. క్రమంగా వచ్చిపడతై. కొంతకాలానికి మనం వాటిని అతిక్రమించి పైకి పోవాలి.

అబద్ధాన్ని విషంమాదిరిగా ఉపయోగించాలి. ఎంత పెద్దజాడ్యాని కుపయోగిస్తే అంతవిలవ ఉంటుంది దానికి. పూర్తిగా జాడ్యరహితమైన నాగరికత ఎప్పుడు వస్తుందో ఏరూపంలోవస్తుందో ఊహించటం నా తలకుమించినపని.

—కొడవటిగంటి కుటుంబరావు.



## శబరి*

"పదిరెండేండ్లు గడచిపోయినవి. పదుమూడవయేడు గూడ గడచుచున్నది. జాడలేదు నాతండ్రి! మాగురువర్యులు మతంగమహర్షులు చెప్పి వెళ్లినారు 'శబరీ! శ్రీరాములు సీతా లక్ష్మణసహితులై వచ్చియున్నారు. చిత్రకూటముకడ నున్నారు. క్రమముగా మన ఆశ్రమప్రాంతమునకు గూడ విచ్చేయుదురు. వారిని దర్శించి ముక్తి రమ్ము' అని. గురుదేవుని ఆజ్ఞ యింతవఱకు నెఱవేర లేదు. ఏ చిట్టడవుల దిరుగుచున్నాడో! చెప్పువారు లేరు. త్రిభువన సంచారిగదా యీ వాయుదేవుడు. 'మా రామునిజాడ నెఱుగుదువా?' అని ప్రతినిత్యము అడుగుదును జబాబుచెప్పడు. విశ్వ విహారులు గదా యీ పక్షిజాతముల: ప్రతినిత్యమడుగుదును 'మా రామయ్యను చూచినారా?' అని బదులు చెప్పవు. ఎచ్చటనో మహోన్నతనగాగ్రముల నుండి పయనించి వచ్చుచున్నవిగదా యీ సెలయేఱులు. అనుదినము విసువు లేకుండ నడుగుదును వీనిని

* బాపట్ల స్త్రీహితైషిణీమండలి వార్షికోత్సవమున ఒక బాలికచే అభినయింపబడినది.